గుడివాడ ప్రథమ శ్రేణి గ్రంథాలయం నిర్వహించిన శారద స్మారక కథల పోటీలో రెండవ బహుమతి పొందిన రచన

# నడుస్తున్న చరిత్ర



**జి. లక్ష్మి**

**అన్ని రోజుల్లోకి ఆదివారాలంటే గొప్ప గ్లామరు నాకు.. రేపు ఆదివారం అనుకోగానే ఎక్కడలేని హాయి మల్లెల పరిమళంలా కమ్ముకుంటుంది. అన్నివారాలూ యాంత్రికంగా ఆఫీసుపనితో గడిపితే, ఆ ఒక్కరోజునాకోసం నేను బతుకుతాను. సాహితీ చర్చలూ, నవలా పఠనాల వనంలో విహరించి ఆ ఇన్‌స్పిరేషన్‌తో తర్వాతి వారమంతా గడిపేస్తాను.**

భోంచేసి పడుకుని ఇవాళ సాయంత్రం ఏం చేద్దామా అని ఆలోచిస్తోంటే హఠాత్తుగా గుర్తొచ్చింది- రమణయ్య మాస్టారుకు ఆరోజే సన్మానమని. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి నలభయ్యేళ్లు అయిన సందర్భంగా ఆయన్ని సత్కరించనున్నట్టు వారం రోజుల కిందట అందిన ఆహ్వాన పత్రిక చూసి ఆశ్చర్యమేసింది.

రమణయ్య మాస్టారుకు మా చుట్టుపక్కల ప్రాంతాలలో స్వాతంత్ర్య సమరయోధుడిగా మంచి పేరుంది. ఏ రైళ్లు పట్టాలు పీకో, రాట్నం తిప్పో వారం, పది రోజులపాటు జైళ్లలో గడిపి పింఛను పుచ్చుకుంటున్న బాపతు కాదాయన. పేరు కోసమో, గొప్ప కోసమో కాక, దేశమంటే వున్న మమతతో సర్వస్వాన్ని త్యాగం చేసిన రుషి. అలాంటి ఆయనకు సన్మానం అంటే ఆశ్చర్యం కాదు మరీ డబ్బులిచ్చి సన్మానాలు చేయించుకుంటున్న ఈ రోజుల్లో.

"ఈ స్వాతంత్ర్య దినోత్సవాలు, సన్మానాలు అన్నీ ఒట్టి హంబక్ అయ్యా. ఎండలో నిలబెట్టి ఏడిపించడానికి బడిపిల్లలు, మాస్టర్లు, ఉద్యోగులు ఫ్రీగా దొరికారని కాకపోతే ఇవి ఎందుకు చెప్ప? చిత్తశుద్ధి లేని శివపూజల్లాగా మొక్కుబడిగా జెండా ఎగరేయకపోతే ఇప్పుడెవరు ఏడ్చారయ్యా? ఎలా అయినా ఆ రోజులే వేరు. అప్పట్లో ఎంత స్పిరిట్‌తో పని చేసేవాళ్లం" ఇలా సాగేది మాస్టారి ధోరణి. అలాంటి మాస్టారు సన్మానానికి అంగీకరించారంటే ఆశ్చర్యం కాదు మరీ. అదేదో తేల్చుకోవడం కోసం అన్నా సన్మానానికి వెళ్లాలని అప్పుడే అనుకున్నాను.

"ఏమోయ్ పెద్దమనిషీ! వర్షం లేదుకానీ బయల్దేరు. 'నడుస్తున్న చరిత్ర' ఎదురుచూస్తుంటారు మన కోసం. తుపానులాగా దూసుకొచ్చాడు రవి. రమణయ్య మాస్టారుకు మా మిత్రబృందమంతా కలిసి ముద్దుగా పెట్టుకున్న పేరది. దారిలో మావాడిని కదిలించాను.

"మాస్టారు సన్మానానికి ఎలా ఒప్పుకున్నారంటావురా" అని.

"నూట పదహారోసారి" అన్నాడు వాడు సీరియస్‌గా.

"ఏంటి" అన్నాన్నేను అర్థంకాక.

"అడ్డమైన వెధవ ఈ ప్రశ్న అడగడం. భేతాళుడి చిక్కుముడి అన్నా విప్పొచ్చుకాని, ఇదో పజిలైపోయింది జనాలకి. దారిలో చిలకజోస్యం వాడెవడన్నా తగులుతాడేమో చూద్దాం" అన్నాడు అడ్డుగోలుగా.

నాకు రవిగాడి మీద అనుమానమే. వాడో ఎన్‌సైక్లోపీడియా లాంటివాడు. కారణమేంటో వాడికి తెలిసి వుంటుంది. కానీ, అందరికీ తెలిసేవరకు నోరు మెదపడు వెధవ. చెప్పడం ఇష్టం లేకపోతే ఇలాగే అడ్డగోలుగా వాగుతుంటాడు. ఇద్దరం నిదానంగా నడుస్తూ కళామందిర్‌కు చేరుకునేటప్పటికి సభ మొదలైపోయిందనడానికి చిహ్నంగా మైకులు హోరెదుతున్నాయి.

వేదిక మీద వున్న అయిదారు కుర్చీలలో మధ్యగా మాస్టారు కూర్చున్నారు. అటూ ఇటూ రాజకీయ నాయకులు గావును కుర్చీలనిండా సరిపడా కూర్చుని ఎటు చూడాలో తెలీక అవస్థ పడుతున్నారు. మాట్లాడే వాళ్లని చూడడంకన్నా ఆ పక్కన కూర్చున్నవాళ్లను చూస్తుంటేనా నాకు గొప్ప సరదా పుడుతుంటుంది. ఆ కొద్దిసేపు 'జూ' జంతువుల్లాగా వాళ్లు చేసే అభినయానికి, పడే పాట్లకి జాలేస్తుంటుంది. మనలాగా పాపం ఫ్రీగా తుమ్మలేరు. దగ్గలేరు. అందరూ తమనే చూస్తున్నారన్న ఫీలింగ్‌లో ఎవరినీ చూడలేరు, చూడకుండా వుండలేరు.

ఇలాంటి మీటింగ్‌కి రాగానే వెనుక సీట్లో కూర్చుని మేం చేసే పని అదే- ఎవరు ఎక్కువ అవస్థపడుతున్నారో చూడడం. వీళ్లు కాక 'ఉత్సవ

నిర్వాహకులు' అనే బిరుదుతో ఇద్దరో, ముగ్గురో స్వతకాయులు కూడా వుంటారు. అంతా వాళ్లే చేస్తున్నట్టు స్టేజీ మీద తెగ హడావుడిగా తిరిగేస్తుంటారు ఇలాంటి రకాలు. నిమి షానికోసారి వచ్చి అధ్యక్షుడి చెవిలో ఏదో గుసగుసగా చెప్పి పోవడం! ఆ రకంగా తాము ముఖ్యులన్న ఉద్దేశం కలి గించడం వాళ్ల టెక్నిక్. వాళ్లు కూడా మా 'ఎర'లే.

మా రవిగాడు అర నిమిషం నుంచి మాట్లాడడం లేదనిపించి హఠాత్తుగా ఆలోచనలోంచి బయటపడి వాడి వేపు చూశాను. వెధవ ఇంకేముంది స్టేజీ మీద నిద్ర పోతున్న ఒక అతిథి దేవుడి మీద కన్ను పెట్టేశాడు. ఇంకొద్ది సేపటిలో 'జో అచ్యుతానంద' అంటూ వాడు జోల పాడినా పాడేస్తాడు. వాడి దృష్టి ఎలా మళ్లించడమా అని ఆలోచిస్తుండగానే "ఈ సీటు ఖాళీనా నండి" అన్న గొంతు వినిపించి చటుక్కున తల తిప్పి చూశాను. ఎవరో అమ్మాయి. ఇరవై మూడు, ఇరవై నాలుగు ఏళ్లుంటాయేమో. నుంచొని నా వంకే చూస్తోంది సమాధానానికి.

నేను మాట్లాడేలోగానే రవిగాడు చప్పున రియాక్ట్ అయి "కూర్చోండి. ఎవరూ లేరు" అంటూ కర్చీఫ్ తీసేస్తుంటే ఆశ్చర్యం వేసింది. వాడు అమ్మాయిల వ్యవహారంలో చప్పున తలదూర్చడు. అలాంటిది ఎవరో అమ్మాయి వచ్చి అడిగితే గౌరవంగా సీటిచ్చేయడం. వాడివంక చూశాను. కష్టపడి స్టేజీ మీదాయన మాటలు వింటున్నట్టు మొహం పెట్టుకుని కూర్చున్నాడు శ్రద్ధగా వెధవ. నేను కూడా వేదిక వైపు తిరిగాను. "ధన్యజీవి, త్యాగజీవి, నిస్వార్థ సేవకుడు, నిరాడంబరుడు" మొదలైన పదాలతో ఫుట్‌బాల్ ఆడేస్తున్నారు వక్తలు. మాస్టారి గురించి కూడా ఆ పడికట్టు పదాలు వినాలంటే బాధేస్తోంది. మాస్టారి పక్కన అట్నించి రెండో సీటులో కూర్చున్నాయన ఎప్పుడూ అదే ఉపన్యాసం ఇస్తాడు. ఎవరికి సన్మానమైనా వాళ్ల పేరు మాత్రం మారుస్తాడు అంతే. అలాంటి ఖర్మ పట్టిందా మాస్టారూ మీకు కూడా నా గుండె బాధగా మూలిగింది.

మాస్టారు మాత్రం వీటన్నిటికి అతీతంగా ఎక్కడో చూస్తూ కూర్చున్నారు. సన్మానం జరుగుతున్నది తనకు కాదన్నట్టు ఆ పొగడ్తలు తనకు కాక తనకు సంబంధం లేని తనలోని మరో వ్యక్తికి అన్నంత నిర్లిప్తంగా వున్నారాయన. ఆయన ఎందుకో బాధపడుతున్నట్టున్నారు. ఎందుకు? ఎందుకై వుంటుంది? ఆలోచన తెగడం లేదు నాకు.

"ట్రాష్. సిల్లీ ట్రాష్" నా పక్క సీట్లో అమ్మాయి సన్నగా గొణిగింది. వచ్చినప్పట్నుంచీ ఆ అమ్మాయి కుర్చీలో తెగ అసహనంగా కదులుతోంది. చెప్పేవాళ్ల వైపు చూస్తూ చిరాగ్గా గొణుగుతోంది. ఆ అమ్మాయిని చూసి ముచ్చటేసింది. అహ! మన బాపతే కాబోలు అనుకున్నాను మెచ్చుకోలుగా.

అంతలో మాస్టారి వంతొచ్చింది. ఆయన లేచి ఏవో రెండు ముక్కలు చెప్పి కూర్చున్నారు. తిరిగి అదే నిర్లిప్తత. మాట్లాడుతున్నప్పుడు ఆయన చూపు ఒక్క క్షణం నా పక్క సీట్లో అమ్మాయి మీద నిలిచినట్లని పించింది నాకు. ఎప్పుడూ తెగ వాగే మా రవిగాడు మాట్లాడకుండా అంత బుద్ధిగా ఉపన్యాసాలు వినడం చూస్తోంటే నాకు వళ్లు మండిపోతోంది. ఏమైంది వీడికివాళ అని. హాల్లో అందరివైపు ఒకసారి మెడ తిప్పి చూశాను ఏం చేయాలో తెలీక. అందులో సగం మంది మా సాహితీ మిత్రులే. అందరూ రమణయ్య మాస్టారి శిష్యులు, శిష్యపరమాణువులు.నాకైతే మాస్టారే సాహితీ గురువులు. ఇంటర్లో వుండగా అనుకుంటా ఒకసారి లైబ్రరీలో ఏదో డిటెక్టివ్ పుస్తకం చదువుతూ ఆయన కంటపడ్డాను. మా ఫ్రెండ్ నడిగి తెచ్చుకున్న పుస్తకం అది.

ఆ పుస్తకమే మేస్టార్ని నాకు పరిచయం చేసింది. అది చూసి తిట్టి లైబ్రరీ అంటే ఏంటో, సాహిత్యం అంటే ఏంటో మొదటిసారిగా కళ్లు తెరిపించారు. అప్పటి నుంచీ శరత్‌నీ, ప్రేమ్‌చంద్‌నీ, ఠాగూర్‌నూ, ఇటు బుచ్చిబాబు, గోపీచంద్, కొ.కు. అందర్నీ నూరుకు తాగడం మొదలుపెట్టాను. ఒక మంచి పుస్తకం చదవడం అంటే ఏంటో నేర్పించిన మాస్టారంటే అందుకే అంత గౌరవం నాకు.

సభలో ఒక్కసారిగా కలకలం నా ఆలోచనలకు బ్రేకుపడింది. అధ్యక్షుడు లేచి సభలో ఇంకెవరన్నా మాట్లాడేవాళ్లు వుంటే మాట్లాడొచ్చని అనౌన్స్ చేశాడు. ఇద్దరు ముగ్గురు మాస్టార్ని తెలిసిన వాళ్లు లేచి మాట్లాడారు. హఠాత్తుగా నా పక్కన కూర్చున్న అమ్మాయి లేచి నిలబడింది. స్టేజీ వైపు వెడుతుంటే తెలిసినవాళ్ళ నెవరన్నా పలకరిస్తుంది కాబోలని చూస్తున్న నేను ఆమె సరాసరి వేదిక ఎక్కడం చూసి ఆశ్చర్య పోయాను. రవిగాడు బెల్లంకొట్టిన రాయిలా అలాగే చూస్తూ కూర్చోడం మరీ ఆశ్చర్యమనిపించింది. మాస్టారి మొహంలో ఏదో కలవరపాటు. ఎక్కడో వెనుక చివరి సీట్లలో కూర్చున్న మాకు కూడా స్పష్టంగా కనిపించేంత కలవరం. ఆ అమ్మాయి మైక్ ముందుకు వచ్చింది.

"ఇప్పుడు ఇక్కడ ఇంతమంది మాట్లాడారు. వాళ్లలో రమణయ్య మాస్టారు గురించి, ఆయన జీవితం గురించి కూడా తెలిసినవాళ్లున్నారు. అయితే ఆశ్చర్యంగా రమణయ్యగారికి ఈ రోజు ఇలా సన్మానం జరగడానికి అసలు కారణమైనవారిని వాళ్లంతా విస్మరించారు.

'మాస్టారు దేశం కోసం సర్వస్వం త్యాగం చేశారు. సంవత్సరాల తరబడి జైళ్లలో జీవితం గడిపారు' అంటూ

ఈ వారం క్యాసెట్ విజేత

## పాత కాలెండరు కథ

నడిచిన పాదాల కింద
ఏ అంకె
పువ్వయి విచ్చుకున్నా
ముల్లయి గుచ్చుకున్నా
మార్పుకు చోటివ్వని
ఒక యూనిఫామ్ నవ్వుతో
దుమ్ము ధూళీ జమా ఖర్చుల
సిరా మరకల నిట్టూర్పుతో
మరపు హస్తాల క్రింద
నిద్రా ముద్రితమైన
ఆ పాత కాలెండరు చూడు
మూసి వుంచిన తలపుల గూడు
ఒక్కొక్కప్పుడు
అదే సమాధి చేసిన జ్ఞాపకాల మీద
మ్రోగించిన నగారా
బంధించిన దృశ్యాన్ని
కలంతో పరుగులు పెట్టించే నయాగరా

- కొండేపూడి నిర్మల




క్వార్ట్జ్ గోడ గడియారం ఉచితం! ప్రతి
యూనిమిక్స్
కిచెన్-మెషన్-తో
త్వరపడండి!
ఈ అవకాశము కొన్నిరోజుల వరకే

ఆంధ్రప్రదేశ్‌కు పంపిణీదారులు:—
ELITE AGENCIES
నాంపల్లి, హైదరాబాద్—1
ఫోన్: 43935
దుర్గయ్య వీధి, ఏలూర్ రోడ్
అరండల్ పేట, విజయవాడ—2
అశోక్ ఆటోమొబైల్స్ వద్ద,
డాబా గార్డెన్స్, వైజాగ్.

పొగిడారు, మెచ్చుకున్నారు. అయితే ఆ కీర్తి అంతా ఆయన ఒక్కరిదేనా?

'ఎంతోమంది దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారు. ఆస్తులు ధారపోశారు. ఇళ్లనీ, కుటుంబాలనీ, భార్యా పిల్లల్ని త్యజించి దేశం కోసం పోరాడారు. అందుకే వాళ్లు గొప్పవాళ్లు' ఇదేగా మీరు చెప్పేం దంతా?''


''మరొకసారి ఆలోచించండి. ఇదంగా వీళ్లొక్కళ్లే చేశారా? కుటుంబాన్ని అర్థంతరంగా వదిలేసి దేశ మంటూ పరిగెత్తితే ఆ ఇళ్లను ఒక కొలిక్కి తెచ్చిన వారి భార్యల సంగతేంటి? ఆస్తుల్ని తగలేసి జైళ్లలో కూర్చున్న భర్తల్ని ఒక్కమాట కూడా అనకుండా రెక్కలు ముక్కలు చేసుకుని పిల్లల్ని పెంచి పెద్దచేసి ఒక దారి చూపించినవాళ్ల కష్టం గురించి ఒక్కరూ మాట్లా డారా? త్యాగాలు చేసినవాళ్లు అంతా మగవాళ్లేనా? జైలుకెళ్లి వస్తే ఇక గొప్పవాళ్లయినట్టేనా? చదువులు, ఉద్యోగాలు, ఆస్తులు లేకుండా కుటుంబాన్ని తీర్చి దిద్దడం జైలు కెళ్లడం కంటే ఏం తక్కువో మీరే చెప్పండి.

సన్మానాలు అంటూ చేస్తే న్యాయంగా వాళ్లకే చేయాలి. మగవాళ్లు దేశం కోసం చేశారు కాబట్టే వాళ్లు గొప్పవాళ్లా? వాళ్ల భార్యలు తమ ఇంటి కోసం కష్ట పడితే అది కష్టం అవదా?

'తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీ లెవ్వరు?' అంటాడు శ్రీశ్రీ. మాష్టారు తాజ్‌మహల్ అంత వున్నతులని పొగుడుతున్నారు మీరు. కానీ ఆయన ఆ ఎత్తుకు ఎదగడానికి రాళ్లెత్తిన కూలీల్లాంటి ఆయన కుటుంబం గురించి ఒక్కరూ చెప్పరే. ఆయన భార్యగాని, పిల్లలు గాని అప్పట్లో ఆస్తి దేశానికి ఇవ్వ డానికి వీల్లేదంటే ఆయనేం చేసి వుండేవారు? 'కుటుం బం బరువు నేను మోయలేను. దేశం సంగతి మాని ముందు మీ ఇంటి సంగతి చూసుకోండి' అని ఆయన భార్య అడ్డుపడి వుంటే ఆయన ఈ రోజు ఎక్కడ వుండేవారు?

భుజంమీద మోపిన అంత బరువునీ చిరునవ్వుతో స్వీకరించి భర్తల్ని, కొడుకుల్ని దేశానికి అంకితం చేసిన మాతృమూర్తుల గురించి, వారి ఔన్నత్యం గురించి చెప్పినవాళ్లు ఒక్కరన్నా వున్నారా? పునాదుల్ని వదిలేసి భవనం గొప్పతనం గురించి పొగుడుతారేం? ఇన్నాళ్లూ మీరు ఆడవాళ్లకు చేస్తూ వచ్చిన మోసం చాలు. ఇక నన్నా మీ చరిత్ర మార్చి రాయండి. దేశానికి భర్తల్ని, కొడుకుల్ని అంకితం చేసి తెర వెనుక మౌన మూర్తుల్లా నిలిచిపోయిన మహిళలకే అందులో స్థానం కల్పించండి. వారు చేసిన త్యాగాల్ని గుర్తించి వాళ్లు పడింది కూడా తక్కువ కష్టం కాదని చాటండి. ఈ గొప్పవాళ్ల వెనుక వున్న అజ్ఞాత మూర్తుల్ని వదిలేస్తే ఆకాశంలో సగ భాగం మిమ్మల్ని ఎప్పటికీ క్షమించదు'' విసురుగా వేదిక దిగి బయటకు వెళ్లిపోయిందామె.

అంతవరకు స్తంభించిపోయిన సభలో అప్పుడు కొద్దిగా చలనం వచ్చింది. నేను వెంటనే రమణయ్య మాష్టారు వంక చూశాను తీవ్రంగా. ఆయన మొహం రక్తం లేనట్టుగా తెల్లగా పాలిపోయింది.




''ఆ అమ్మాయి రమణయ్య మాష్టారి అమ్మాయి. హైద్రాబాద్‌లో ఏదో ఉద్యోగం చేస్తోంది'' నా చెవిలో మెల్లగా గొణిగాడు రవిగాడు.

నా కళ్లముందు ఏవో తెరలు తొలగిపోతున్నట్లని పించింది. మాష్టారి నిర్లిప్తతకు కారణం ఇంట్లో కూడా ఇలాంటి గొడవ జరగడమేమో- హఠాత్తుగా స్ఫురించింది నాకు.

''మాష్టారూ 'ఇగో'ని తృప్తి పరుచుకోవడానికే సన్మానానికి ఒప్పుకునుండొచ్చు'' అప్పుడు బైట పెట్టాడు రవిగాడు. మాష్టారు ఇల్లు పట్టించుకోకుండా దేశం దేశం అంటూ తిరిగి తమ జీవితాల్ని నాశనం చేశా రని ఆయన పిల్లలకు కోపం. భర్తను పల్లెత్తు మాట అనకుండా అహోరాత్రాలు కష్టపడి తమను ఆ స్థాయిలో నిలబెట్టగలిగిన తల్లంటే గౌరవం. చిన్నప్పుడు భయంతో నోరు మెదపకపోయినా తర్వాత్తరవాత ఆయనపై పరో క్షంగా దాడి మొదలుపెట్టారు. దానికి ఇది పరాకాష్ట. పిల్లల విమర్శలతో ఆయన 'ఇగో' దెబ్బతిని తనను తాను నమ్మించుకోవడానికే ఈ సన్మానానికి ఒప్పుకునుం డొచ్చు'' అన్నాడు తిరిగి.

మాష్టారిమీద జాలితో నా మనసు నిండిపోయింది. కానీ అది ఒక్క క్షణమే. మరుక్షణం ఆ అమ్మాయి అన్న దానిలో నిజాన్ని గమనిస్తూ మౌనంగా వుండిపోయాను. ●

## గీత్‌మాల క్యాసెట్ గెలుపొందిన కాలమ్ దాటని కథ

రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో విజయ వాడ నుండి గుంటూరు ''నాన్ స్టాప్ బస్'' బయలు దేరింది. ఈ నాన్ స్టాప్ బస్సులో కండక్టర్లుండరు.

బస్సు స్లోగా పోతోంది. ఊరుదాటి-బ్యారేజిదాటి, తాడేపల్లి సిమెంటు ఫ్యాక్టరీదాటి, మంగళగిరి ఓవరు బ్రిడ్జిదాటి చివరకు మంగళగిరి కూడా దాటి బస్సు చాలా స్లోగా పోతోంది.

వెనకాలొస్తున్న బస్సులు-లారీలు-కార్లు మన బస్సుని దాటి పోతున్నాయ్.

## నాన్‌స్టాప్ బస్

ఉన్నట్టుండి ఓ గొంతు పెద్దగా - ''ఏమండోయ్ డ్రైవర్‌గారు. ఏమిటి బస్సింత స్లోగా పోనిస్తున్నారు కాస్త స్పీడ్ పెంచండి స్వామీ''

ఇంకో గొంతు అందుకొంది- ''బయలుదేరి ముప్పావు గంటయ్యింది. ఈపాటికి గుంటూరు చేరు కోవాల్సింది''

మరో గొంతు - ''వెనకాల వస్తున్న బస్సులు మనల్ని దాటి పోతున్నాయ్'' ''ఇది నాన్ స్టాప్ బస్సా - ప్యాసింజరు బస్సా! పోనియ్యవయ్యా కాస్త స్పీడ్‌గా''

ఇలా ప్యాసింజర్లు ఇంత గొడవ చేస్తున్నా డ్రైవరు ఇదేమీ పట్టించుకొన్నట్లు లేదు. బస్సు స్లోగానే పోతోంది. యూనివర్సిటీ దాటింది!

ప్రయాణీకుల్లో సహనం చచ్చిపోయినట్లుంది. ఇంతలో ఓ గొంతు - ''పాపం డ్రైవర్ ముసలోడు రిటైర్‌మెంటు దగ్గర కొచ్చినట్లుంది. కళ్ళజోడున్నా చూపందడం లేనట్లుంది. కాస్త ఓపిక పడితే -ఓ పావు గంటలో గుంటూరు వచ్చేస్తుంది'' డ్రైవర్ని సపోర్టు చేసిందా గొంతు.

''చాల్లేవయ్యా నీ సపోర్టు-మహా చెప్పొచ్చావు. ఇది నాన్ స్టాప్ బస్! తెలిసిందా! ప్యాసింజరు బస్సు కాదు. ఈ బస్సు టిక్కెట్టు రేటెక్కువ. ఈపాటికి గుంటూరు చేరాల్సింది-ఇలానే పోతే ఇంకో అరగంట అయినా పట్టేట్టుంది'' అంటూ అందరూ అరవడం మొదలెట్టారు.

ఇదంతా వింటున్న డ్రైవర్ - తాపీగా - ''బాబూ- యిది ప్యాసింజరు బస్సు కాదన్న సంగతి నాకు మాత్రం తెలియదా! ఇది నాన్ స్టాప్ బస్సే. అంటే ప్రతి స్టాప్‌లో ఆగదని. అంతేకాని యిది ''ఎక్స్‌ప్రెస్'' బస్సు మాత్రం కాదన్న సంగతి మర్చిపోకండి! చూడండి బాబూ నిదానమే ప్రధానమన్నారు. 'గో స్లో- రీచ్ సేఫ్' అన్నారు. మీ క్షేమం గురించే నిదానంగా నడుపు తుంట'' సమాధానం చెప్పాడు డ్రైవరు.

అంతే! ప్యాసింజర్లు ఒకరి మొఖం మరొ కరు చూసుకోసాగారు. అంతా నిశ్శబ్దం. ఇంతలో-పొగాకు కంపెనీలు దాటి గుంటూరు-తెనాలి రైలు గేటు దగ్గరకొచ్చి ఆగింది బస్సు. -అమూల్యశ్రీ